# సీతారామాభ్యాం నమః



శాస్త్రిగారు దర్భకర్రలా పచ్చగా, పొడవుగా ఉంటారు. ఆయన అసలు పేరేవిటో తెలియదు. అందరూ రామాయణం శాస్త్రిగారంటారు.

కళ్యాణమంటపంలో రాత్రి ఎనిమిది గంటలవేళ చుట్టూ చిమ్మ చీకటి. మంటపంలో ఆముదం దీపం అఖండంగా వెలుగుతూంటే పక్కన వ్యాస పీటమీద రామాయణం ఉంచుకుని వ్యాఖ్యానం చేస్తున్నారు శాస్త్రిగారు. దాన్ని వ్యాఖ్యానం అనటానికి లేదు. గంట మోగినట్టుండే ఆ కంఠంలోంచి ప్రవాహంలా రామకథ సాగుతుంది. భగీరథుడి వెనకాల గంగపరుగెత్తినట్లు జలపాతంలా దూకుతోంది. ఆ కథనంలో ఎన్ని సుళ్ళు, ఎన్ని మలుపులు, ఎంత నిదానం, ఎంత ఆర్ద్రత. చెట్లు చెవులు రిక్కించి వింటున్నట్టుంది. గాలంతా రామ మయం అయిపోతుంది. వింటున్నవాళ్ళు బొమ్మలై పోతారు. పిల్లలు సైతం ఉలకరు పలకరు. మనసున రామచింతన తప్ప, మరో ధ్యాసలేదు.

శాస్త్రిగారు తన్మయులై చెప్పుకుపోతున్నారు. ఆనాడు రామ పట్టాభిషేకం నిశ్చయమైననాడు సీతమ్మ తన స్వామి రాకకోసం ఎదురు చూస్తోంది. స్వామి రానేవచ్చాడు. ఎలా వచ్చాడు? పట్టాభిషేక లాంఛనాలతో, చక్రవర్తి

అలంకారాలతో రాలేదు. నార చీరలు కట్టుకుని ఆటవికుడిలా వచ్చాడు. సీతమ్మ విస్తుపోయింది. మరీ విస్తుపోనివ్వకుండా రామయ్య అన్నాడు. "తండ్రి ఆన ప్రకారం పధ్నాలుగేళ్ళు అరణ్యవాసం వెడుతున్నాను" అని. సీతమ్మ అరక్షణం ఆగి లోపలికెళ్ళిపోయింది. దుఃఖం పట్టలేక పోయిందేమో అనుకున్నాడు రామయ్య. మరికొంచెం సేపట్లో సీతమ్మ నారచీరలు కట్టుకొచ్చి "నేనూ అరణ్యాలకు తమననుసరిస్తా" నంది. ఇప్పుడు విస్తుపోవటం రామయ్య వంతు. "జనక మహారాజు బిడ్డవు. ఎండ కన్నెరుగని దానవు. రావద్దు" అన్నాడు. "స్వామీ. నీవులేని ఈ భవనం నాకు శూన్యం కదా! నీవు పక్కన లేక అమృతమూ అరుచియే కదా! నీ సాన్నిధ్యం నాకు స్వర్గం. నన్ను వారించకండి." అంటూ భర్త ననుసరించి పువ్వులమీద నడిస్తే కసుగందే సీతమ్మపాదాలు ముళ్ళబాటల్లో, రక్కసి పొదల్లో నడుస్తుంటే పాదాలు చీరుకుపోయి, నెత్తురు చిప్పిలుతున్నా, భర్త సన్నిధే తనకు ప్రాణమని చిరునవ్వు నవ్విందే కాని కంటనీరెట్టలేదయ్యా......

జనంలో ఉన్న రుక్మిణి కన్నీరు మున్నీరై పోయింది. రుక్మిణి అత్తగారిమీద కోపం వచ్చి అత్తిల్లు వదిలి పుట్టింటికి వచ్చి ఆర్నెల్లయింది. ఉన్నట్టుండి రుక్మిణికి భర్తమీద పోయింది మనసు. అన్నం సరిగ్గా తింటున్నాడో లేదో? అన్నం అయ్యాక ఆకు, పక్క తనే వేసుకుంటున్నాడు కాబోలు. అర్ధరాత్రి మెలకువ వచ్చినప్పుడు తాగటానికి మంచంకింద మంచినీళ్ళు పెడుతున్నారో మర్చిపోతున్నారో! స్నానమాడుతున్నప్పుడు వీపెవ్వరూ రుద్దరు కాబోలు. ఇష్టమైన కొత్తిమెర కారం నూరి పెట్టరు కాబోలు! దుఃఖం పొంగుకు రాగా కొంగుతో ముఖం కప్పుకుంది.

ఉదయాన్ని శాస్త్రిగారు ఇంటింటి ముందుకు వచ్చి "సీతారామాభ్యాం నమః" అంటారు. ఇంటివారు గుప్పెడు బియ్యం యాయవారం చెంబులో పోస్తే, ఆ రోజు తిథి, వారం, వర్జ్యం చెప్తారు. అలా చెప్పుకుంటూ పెద్దబజార్లో కొస్తే అక్కడ రైతులు కొత్త నాగలి పట్టడానికి ముహూర్తాలు, పిల్లకి చెవులు కుట్టడానికి మంచిరోజు అడుగుతారు. పంచాంగం తీసి వాళ్ళకి మంచిరోజులు చెప్పి రుక్మిణి

ఇంటిముందుకొచ్చి "సీతారామాభ్యాం నమః" అన్నారు. రుక్మిణి పరుగెత్తుకొచ్చి "అయ్యా! తూర్పు ప్రయాణానికి మంచి రోజెప్పుడు?" అనడిగింది.

శాస్త్రిగారు ఆలోచనగా రుక్మిణివైపు చూసి పంచాంగం విప్పకుండానే 'తూర్పున సూర్యుడుంటాడు. సూర్యుడు నీ దేవుడు. నీ దేవుడి దగ్గరకెళ్ళటానికి సంకల్పమే ముహూర్తం. భోజనం చేసి వెంటనే బయలుదేరు, అన్నాడు. రుక్మిణి ముఖమింతయింది. అరసోలెడు బియ్యం చెంబులో పోసింది.

ఆ రోజు ఋష్యమూక పర్వతంమీద శ్రీరామచంద్రుడికి దొరికిన నగలు చూపిస్తున్న ఘట్టం. నగల మూట విప్పాడు రామయ్య. కన్నీటి పొరలు కమ్ముకుంటున్నాయి. ఏమీ కన్పించటం లేదు. అవి ఏం నగలో సీతమ్మవవునో కాదో చెప్పలేకపోతున్నాడు. పక్కనున్న లక్ష్మణుణ్ణి పిలిచి "తమ్ముడూ నాకేం కన్పించటం లేదు. ఇవి నీ వొదినగారి నగలవునో కాదో చెప్పవయ్యా" అన్నాడు. లక్ష్మణుడు ఆ నగలు పరిశీలించి, " ఈ కర్ణపత్రాలు, నాసికాభరణాలు, ఇవి ఎవరివో నాకు తెలియదు. కాని ఈ పాద మంజీరాలు మాత్రం మాతృ సమానురాలైన నా వదినగారివే" అన్నాడు. అంటే ఆ లక్ష్మణస్వామి ప్రతిరోజూ సీతమ్మ పాదాలకు వందనం చేసుకునేవాడు. ఆమె కాలి పట్టీలు తప్ప, ఆ పదయుగ్మం తప్ప మరింకేవీ తెలియని మహా భక్తుడయ్యా ఆయన."

ఇది విన్న రుద్రయ్య కళవళ పడిపోతున్నాడు. వొదినగారి మీద కోపంతో అన్నతో వేరుపడి వచ్చిన రుద్రయ్య, మరునాడే క్షమాపణ చెప్పాకుని అన్నతో కలసిపోయాడని వేరే చెప్పక్కర్లేదు.

పదేళ్ళు గడిచాయి. కళ్యాణమండపంలో ఆముదం దీపం పక్కనుంచి రామాయణం విన్పించటం లేదు.ఇప్పుడు చూస్తే పదిమంది పెట్రోమాక్సు లైట్లు పెట్టుకుని పేకాడుకుంటున్నారు. వెనక రామమయంగా వుండే గాలిలో "నీ యమ్మ జోకరు " లాంటి బూతులు తేలుతున్నాయి.

ఇప్పుడే రామాయణం విడివడిన కుటుంబాలను కలుపుతుందో, సత్యాన్ని నిలబెడుతుందో!*